క్లుప్తంగా

జలకళ బోర్ల పరిశీలన



బోరును పరిశీలిస్తున్న క్వాలిటీ అధికారులు

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన బోర్లను జిల్లా జాయింట్ క్వాలిటీ ఆఫీసర్ నూర్‌మహమ్మద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలకళ పథకం రైతులకు వరం లాంటిదన్నారు. అవినీతికి తావులేకుండా ఎన్ని అడుగుల మేరకు బోర్లు వేశారని పరిశీలించి నీరు ఏ మాత్రం లభ్యమవుతుందనే నివేదికను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈసీ రాఘవేంద్ర, టీఏ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ నితీష్, రైతులు చౌడప్ప, మహమ్మద్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక 3వ వార్డు కౌన్సిలర్ స్వాతి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 3వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆమె అన్నప్రాసన చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఇకపై గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను ఇళ్ల వద్దకే తెచ్చి ఇస్తారని తెలిపారు. అంగన్‌వాడీ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంగమాంబ పల్లకోత్సవం

చిప్పగిరి: గడేకల్లు భీమలింగేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా 7 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే మంగమాంబ అవ్వ పల్లకీ ఊరేగింపు బుధవారం బెల్డోణ గ్రామం చేరుకుంది. ఆ గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీ గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా 6వ తేదీన గంగను తీసుకొని తిరుగు ప్రయాణంలో బెల్డోణ గ్రామంలో రామనాథ శాస్త్రి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదే రోజున కరిడి గుట్టంలోని మారెమ్మ అవ్వ దేవాలయానికి మంగమాంబ అవ్వ విగ్రహం చేరుకోనుంది.

సీనియర్ పాత్రికేయుడు నాగయ్య మృతి



నాగయ్య (ఫైల్)

వెల్దుర్తి: కృష్ణగిరి మండల సీనియర్ పాత్రికేయుడు నాగయ్య (57) మంగళవారం రాత్రి గుండెనొప్పితో కన్నుమూశాడు. వెల్దుర్తి రాణి తోటలో నివాసముంటున్న నాగయ్య మూడు నెలల క్రితం ఆరోగ్యశ్రీ ద్వారా స్టంట్ వేయించుకున్నాడు. కోలుకుని తిరిగి పాత్రికేయ విధులు నిర్వహించేవాడు. మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత గుండెనొప్పి రావడంతో నాగయ్యను కర్నూలు ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందాడు. ఆయన వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో 30 ఏళ్లుగా వివిధ పత్రికల్లో విలేకరిగా సేవలందించారు. నాగయ్య మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఫారిన్‌లో ఉన్న కృష్ణగిరి జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



హెచ్‌బీఎస్ కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతతో పాటు రోలింగ్ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఇంజినీరింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు సెక్రటరీ నియామకం



స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి మాధవ కృష్ణారెడ్డి

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్–3 కార్యదర్శి మాధవ కృష్ణారెడ్డిని స్పెషల్ గ్రేడ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఉమాపతి రెడ్డి దీర్ఘకాలిక సెలవులో వెళ్లాడు. ఆయన స్థానంలో మాధవ కృష్ణారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ యార్డు సిబ్బంది, దళారి మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు మాధవ కృష్ణారెడ్డిని పూలమాలలతో సత్కరించారు.

■ పది నిముషాల్లో పని పూర్తి



నాపేరు బోయ నాగరాజు. మద్దికెర మండలం బురుజుల గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నా. ఆధార్‌లో ఫోన్ నెంబర్ లింకు కాకపోవడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లా. పది నిముషాల్లో నా పని పూర్తయింది. గతంలో ఆధార్ తప్పులు సరిదిద్దుకునేందుకు 10 కి.మీ దూరంలో వున్న పత్తికొండకు, లేదంటే 45 కి.మీ దూరంలోని ఆదోనికి పోవాల్సి వచ్చేది. ఈ కారణంగా పనులు మానుకోవడంతో పాటు వ్యయప్రయాసలు పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు ఏ పని కావాలన్నా గ్రామంలోనే చకచకా జరిగిపోతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

■ గతంలో అష్టకష్టాలు పడ్డాను



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సుజాత. కొత్తకైరవాడి గ్రామ నివాసి. ఈమె కుమారుడు హేమంత్‌కుమార్ పేరును రేషన్ కార్డులో చేర్చేందుకు అష్టకష్టాలు పడింది. కుమారుడికి ఆధార్ కార్డు వచ్చి ఏడాది గడిచింది. రేషన్ కార్డులో మాత్రం పేరు నమోదు కాలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్ ఇంటివద్దకే వెళ్లి సమస్య తెలుసుకుని, ఆధార్ కార్డులు సేకరించి గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేశాడు. వెంటనే సురక్ష కార్యక్రమం ద్వారా సర్పంచ్ ఈశ్వరమ్మ చేతుల మీదుగా తన కుమారుడి పేరు నమోదైనట్లు కొత్త రేషన్ కార్డు పొందింది. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా రేషన్ కార్డులో పేరు నమోదు చేయడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. సురక్ష కార్యక్రమం తమలాంటి వాళ్లకు అండగా నిలిచిందని పేర్కొంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

■ కౌలు కార్డు వెంటనే ఇచ్చారు



ఈ చిత్రంలో కౌలు రైతు కార్డు చూపిస్తున్న రైతు పేరు కురవ నాగేంద్ర. నందవరం మండలం నదికైరవాడి గ్రామ నివాసి. పొలం కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేస్తున్నాడు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్ ద్వారా కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. రోజుల రోజుల వ్యవధిలోనే మండల అధికారుల చేతుల మీదుగా సురక్ష కార్యక్రమంలో కౌలు కార్డు తీసుకున్నాడు. పైసా ఖర్చు లేకుండా చేతికి సీసీఆర్‌సీ కార్డు రావడంతో నాగేంద్ర ఆనందం వ్యక్తం చేశారు. తమ లాంటి వాళ్లు కౌలుకార్డు తీసుకోవాలంటే నానా అవస్థలు పడాల్సి వచ్చేదని, సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నాడు.

సురక్షతో సేవలు సులభతరం

- ఉచితంగా ధ్రువపత్రాల జారీ
- అప్పటికప్పుడే మంజూరు చేయడంతో తొలగిన ప్రయాసలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గుడేకల్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న వై.రుద్రగౌడ్



హత్తిబెళగల్‌లో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ



బొమ్మిరెడ్డిపల్లెలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎమ్మిగనూరురూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ పేర్కొన్నారు. బుధవారం గుడేకల్ గ్రామంలోని సచివాలయం-1 లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని దరకాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ నరసమ్మ, ఎంపీటీసీలు అయ్యప్ప, రాజు, మండల ప్రత్యేకాధికారి విజయకుమార్, ఎంపీడీవో బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే కె.తిమ్మాపురం గ్రామంలో ఈఓఆర్డీ విజయలక్ష్మి, సర్పంచ్ మహేశ్వరమ్మ, తదితరులు ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారు.

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో సర్పంచ్ శేఖన్ బీ అధ్యక్షతన సచివాలయ కన్వీనర్ నాగేంద్ర సమక్షంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 102 మందికి సర్టిఫికెట్లు అందజేశారు.

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లెలో బుధవారం డీటీ ప్రసాద్‌రాజు, ఈఓఆర్డీ నరసింహులు ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న అతిథులు ఏఓ అక్బర్‌బాష, జెడ్పీటీసీ సుంకన్న, బొమ్మిరెడ్డిపల్లె మధుసూధన్ రెడ్డి, నార్లాపురం సర్పంచ్ కొటిరెడ్డిలు లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందించారు. పలువురు గ్రామస్తుల ఆధార్‌కార్డులకు వారి మొబైల్ నంబర్ అనుసంధానం చేశారు.

తుగ్గలి: మండల పరిధిలో బుధవారం మారెళ్ల, చెన్నంపల్లిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించిన అధికారులు లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. చెన్నంపల్లిలో మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ సావిత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగనాథరెడ్డి, సుధాకరరెడ్డి, లింగన్న, రాముడు, రంజాన్ పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని కొత్తకైరవాడి, ఇబ్రహీంపురం గ్రామంలో సర్పంచులు, మండల అధికారులు ఎంపీడీఓ దశరథరామయ్య, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నదికైరవాడి గ్రామ సచివాలయంలో పరిధిలో 590 ధ్రువీకరణ పత్రాలు, ఇబ్రహీంపురంలో 455 సర్టిఫికెట్లు జారీ చేశారని పేర్కొన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా, సర్పంచ్ ఈశ్వరమ్మ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఇబ్రహీంపురం సర్పంచ్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్య తీరింది



మాది పగిడిరాయి గ్రామం. కుటుంబ విభజన కాక పక్కా గృహం మంజూరు కాలేదు. పాత మిద్దెలోనే ఉంటూ ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు జగనన్న సురక్షలో కుటుంబ విభజన, పొజిషన్ పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నారు. వ్యయప్రయాసలు లేకుండా అధికారులు వెంటనే కుటుంబ విభజన చేసి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. కొత్త ఇళ్లు కట్టుకునేందుకు వీలు కలిగింది. కొంతకాలంగా పరిష్కారం కాని సమస్య ఇప్పుడు వెంటనే తీరినందుకు సంతోషంగా ఉంది.

– అనుంరాజు బంగారప్ప, పగిడిరాయి

అడంగల్‌లో కరెక్షన్ చేశారు



నా పేరు ఈరన్న. సర్వే నంబర్ 626/బి లో 13.75 ఎకరాల పొలం ఉంది. ఇది మా తాతల ఆస్తి. ఆన్‌లైన్ అడంగల్‌లో అనువంశికానికి బదులు కొనుగోలు అని నమోదై ఉంది. సమస్య పరిష్కరించాలని ఎన్నోసార్లు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి విన్నవించాను. పని జరగలేదు. జగనన్న సురక్షలో భాగంగా వలంటీర్‌కు సమస్యను వివరించాను. దరఖాస్తు ఫారానికి కావాల్సిన నకలు పత్రాలు తీసుకున్నారు. బుధవారం అడంగల్‌లో కరెక్షన్ చేశారు.

– ఈరన్న, రైతు, హత్తిబెళగల్ గ్రామం

జగన్ మామయ్యకు కృతజ్ఞతలు



నేను పత్తికొండలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుచున్నాను. కాలేజీలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. ఒక్కరోజు ముందు వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోగా వెంటనే సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమం ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్ మామయ్యకు కృతజ్ఞతలు.

– విజయలక్ష్మి, విద్యార్థి, అస్పరి

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ



డయాలసిస్ పేషెంట్ రవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రజియా

హొళగుంద: మూత్రపిండ సమస్యతో ఆపరేషన్ చేయించుకుని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవికి ఆపత్కాలంలో పింఛన్‌ను అందజేసి ఆదుకుంది హొళగుందకు చెందిన వలంటీర్ రజియా. రవి కొద్ది రోజుల క్రితం యశోద ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుని డాక్టర్ల పర్యావేక్షణలో ఉన్నాడు. దీంతో ఈ నెల 1వ తేదీన పింఛన్ అందుకోలేకపోయాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ రజియా తన భర్త సాబ్జన్ సాయంతో మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లి బుధవారం రవికి పింఛన్ అందజేసింది. తనకోసం ఇంత దూరం వచ్చి పింఛన్ అందించడంపై లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణగిరి: పోతుగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని జి.మల్లాపురానికి చెందిన ఈడిగ ఈశ్వరమ్మ కాలి గాయంతో కర్నూలులోని శ్రీచక్ర ఆస్పత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ బోయ ఎర్రమల బుధవారం అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న తనకు ఆస్పత్రికే వచ్చి పింఛన్ అందజేయడంపై లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపింది.

ఐసీడీఎస్‌కు నిధులు కేటాయించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఐసీడీఎస్ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, సీఐటీ యూ నాయకుడు రాముడు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపై ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. సంఘ నాయకులు నీరజ, మల్లేశ్వరి, శైలజ, సుమిత్ర, భారతి, అరుణ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి చర్యలు

వెల్దుర్తి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసూన తెలిపారు. బుధవారం ఆమె పేర్కొంటూ.. 6వ తరగతిలో ప్రవేశానికి ఎస్టీ కేటగిరిలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 7వ తేదీ సాయంత్రంలోపు తమ గురుకులంలో నమోదు చేసుకోవాలని 8న రాత పరీక్ష నిర్వహించి అడ్మిషన్‌కు ఎంపిక చేస్తామని వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: దైవందిన్నె గ్రామంలో బుధవారం సాయంత్రం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి తెలిపారు. పేకాటాడుతున్నట్లు సమాచారం రావటంతో వెళ్లి దాడి చేసి నలుగురిని పట్టుకున్నామని, వారి నుంచి రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ కోతలు

గోనెగండ్ల: మండలంలోని హెచ్.కైరవాడి, కులుమాల గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సుధాకర్ రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 33 కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున ఆ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో బుధవారం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉద్యోగులకు నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, డీఎస్పీ సీతారామయ్య, ఈఈ శైలేశ్వర్, డీఈ లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. మొత్తం 180 మంది ఉద్యోగులకు ఈసీజీ, 2డీఎకో తదితర పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి వీరేంద్ర, వైద్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కృష్ణగిరి: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం కృష్ణగిరికి వస్తారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు కంబాలపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం ఎరుకలచెరువు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో ఏర్పాటు చేసిన సీసీ రహదారులను ప్రారంభిస్తారని వెల్లడించారు. అనంతరం గ్రామంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమానికి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

కార్లు ఢీకొని నలుగురికి గాయాలు

నందవరం: మండలంలోని హాలహర్వి గ్రామం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జాతీయ రహదారి–167లో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. బుధవారం ఎస్ఐ తిమ్మయ్య తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన మేఘనాథ్, బసవరాజు, అజయ్‌స్వామి, పవన్‌కుమార్ వీడబ్ల్యూ పోలో కారులో తిరుపతికి వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన రాజు టోయాట ఇతియోస్ కారులో మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరుకు బయలుదేరాడు. మండలంలోని హాలహర్వి సమీపంలో జాతీయ రహదారిలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. పోలో కారుల్లో ఉన్న నలుగురికి రక్త గాయాలయ్యాయి. రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాయచూరుకు తరలించారు. మేఘనాథ్, బసవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

హాలహర్వి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు సూచించారు. ఆయన బుధవారం మండలంలోని చింతకుంట, కొక్కరచేడు, బేవినహాల్ గ్రామాల్లో ఎంపీడీఓ ఆంతోని, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్నతో కలిసి పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అలాగే సచివాలయ నిర్మాణాలను తనిఖీ చేశారు. నిర్మాణాల్లో జాప్యం చేయరాదని కాంట్రాక్టర్లను ఆదేశించారు. బిల్లులు ఎప్పటికప్పుడు విడుదలవుతున్నాయని, పనుల్లో పురోగతి సాధించాలన్నారు. అలాగే సచివాలయ అధికారులు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పొదుపు సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

ఆలూరు: గ్రామ, మండల ఐక్య సంఘాల సభ్యులు ఆర్థిక, సామాజికంగా బలోపేతం కావాలని ఐకేపీ వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని మొలగవెల్లి, ఆలూరు గ్రామాల్లోని ఐక్య సంఘం సభ్యులతో బుధవారం సమావేశమై బ్యాంకులో పొందిన రుణాలు, రికవరీ, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు, పశువులు, గొర్రెలు, మేకల పెంపకం, కిరాణం షాపులు, వ్యవసాయ ఉత్పత్తి రంగాలు, రైతుల పరిస్థితులపై చర్చించారు. గ్రామైక్య సంఘాల ద్వారా రుణం పొందిన వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేయాలన్నారు. ఏపీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఆలూరు రూరల్: తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య సూచించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బాపురం, చింత కుంట, సమ్మతగేరిల్లోని స్టోరేజ్ ట్యాంకులలో 30 % నీరు మాత్రమే నిల్వ ఉందన్నారు. అలాగే తుంగభద్ర డ్యాంలో 3.71 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని, అక్కడ నీటి నిల్వ పెరిగితేనే ఇక్కడి స్టోరేజీల్లో ఎల్ఎల్‌సీ ద్వారా నీటిని నిల్వ చేసుకోవచ్చని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు నీళ్ల వదిలే సిబ్బందితో మాట్లాడి సరఫరా సమయాన్ని కుదించాలని తెలిపినట్లు చెప్పారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

నందవరం: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో బుధవారం రాత్రి ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. గ్రామంలో దుర్యోధన స్వామి ఇంటి ముందు గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. గ్రామస్తులు గమనించి లైన్‌మెన్‌కు, విద్యుత్ అధికారులకు ఫోన్ చేయగా స్పందించలేదని వారు వాపోయారు. స్థానికులు ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేసి విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. అత్యవసర పరిస్థితిలో స్పందించని విద్యుత్ శాఖ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తుగ్గలి: జెమ్ కేర్ కామినేని ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో గురువారం పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యులు ఎస్‌వీ చంద్రశేఖర్, చెరుకు రాఘవేంద్ర హాజరై బీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం

ఆస్పరి: మండలంలోని డీకోటకొండ గ్రామంలో జగనన్న కాలనీకి బుధవారం విద్యుత్ సౌకర్యం కల్పించారు. కొత్తగా 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 10 విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు ఏర్పాటు చేయగా సర్పంచ్ బీటీ జయలక్ష్మి పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. డీకోటకొండ గ్రామంలో 17 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వీరిలో ఏడుగురు ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశానికి సిద్ధమయ్యారని, మిగతా ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సునీల్, లైన్‌మెన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు వింటూ..



పి.కొత్తూరులో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటన సాగింది. బుధవారం పి.కొత్తూరు, పగిడిరాయిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి, బసిరెడ్డి, ఎంపీపీ ఆదెమ్మ, సర్పంచ్ సౌజన్య, తదితరులతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పి.కొత్తూరులో తాగునీటి సమస్య తీర్చాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని, కంది, ఆముదం పంటలకు పంటల బీమా రాలేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్నారన్నారు. పార్టీకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని చెప్పారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. నాయకులు రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, తుగ్గలి మోహన్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, టీఎండీ హుసేన్, చాంద్‌బాషా, అమరనాథరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



కడిమెట్లలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడిమెట్ల గ్రామంలోని సచివాలయం–2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందుతున్నాయని వివరించారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నను 2024 ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ బోయ పెద్దమారెప్ప, నాగభూషణం రెడ్డి, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బస్సు యాత్ర తుస్సు

ఆస్పరి: తెలుగుదేశం పార్టీ చేపట్టిన బస్సు యాత్ర జనం లేక వెలవెలబోయింది. పత్తికొండ నుంచి వచ్చిన టీడీపీ బస్సు యాత్ర బుధవారం ఆస్పరికి చేరుకుంది. స్థానిక అంబేడ్కర్ కూడలిలో బహిరంగ సభ నిర్వహించగా ప్రజలు ఆసక్తి చూపలేదు. వెంట వచ్చిన కొద్దిమంది జనంతోనే నాయకులు ప్రసంగాలను ముగించారు. బస్సు యాత్ర ద్వారా టీడీపీలో మరోసారి నాయకుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. యాత్రలో టీడీపీ ఆలూరు నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జ్‌లు వైకుంఠం మల్లికార్జున చౌదరి, వీరభద్రగౌడ్ పాల్గొనలేదు. గతంలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఆస్పరికి వచ్చిన సందర్భంగా స్థానిక అంబేడ్కర్ కూడలిలో వీరభద్రగౌడ్ వర్గం వారి జీపులను కోట్ల సుజాతమ్మ వర్గానికి చెందిన నాయకులు అడ్డుకోవడమే గాకుండా జెండాలను పీకేశారు. దీంతో వీరభద్రగౌడ్ వర్గం టీడీపీ చేపట్టిన ఏ కార్యక్రమంలోనూ పాల్గొనడం లేదు.

అక్కసుతోనే తప్పుడు ఆరోపణలు

మద్దికెర: టీడీపీ చేపట్టిన బస్సు యాత్రకు జనాలు రాకపోవడంతో తట్టుకోలేక ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ మల్లికార్జున అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. మండలంలో ఎవరు మట్కా రాస్తున్నారో, ఎవరు కర్ణాటక మద్యం అమ్ముతున్నారో, ఎవరు పేకాట ఆడిస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు. మద్దికెరలో మట్కా, మందు విక్రేతల ఇళ్లలో విందు భోజనాలలో మాజీ డిప్యూటీ సీఎం తనయుడు కేఈ శ్యాంబాబు పాల్గొనలేదా అని ప్రశ్నించారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, నాయకులు కృష్ణ, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.